నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
18వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
మంగళవారం
27 ఆగస్టు 2024
పేజీలు: 02

# ఎమ్మెల్సీ కవితకు బెయిల్

## 5 నెలలు రిమాండ్ ఖైదీగా.. 153 రోజుల్లో 11 కేజీల బరువు తగ్గిన కవిత

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ స్కాంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవితకు బెయిల్ మంజూరు అయింది. ఈడీ, సీబీఐ కేసుల్లో కవిత సుప్రీం కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా.. నేడు జస్టిస్ గవాయ్, విశ్వనాథ్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. గంటన్నర పాటు వాడీ వేడిగా వాదనలు జరగ్గా.. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం కవితకు ఈడీ, సీబీఐ కేసులో బెయిల్ మంజూరు చేసింది. ఢిల్లీ లిక్కర్ స్కాంలో కేసులో కవితను ఈ ఏడాది మార్చి 25న ఈడీ అధికారులు హైదరాబాద్‌లో అరెస్టు చేశారు. ఆ తర్వాత ఏప్రిల్ 11న సీబీఐ కూడా అదుపులోకి తీసుకుంది సౌత్ గ్రూప్ ద్వారా రూ.100 కోట్ల స్కాంకు పాల్పిడనట్లు అభియోగాలు మోపారు. ఈ మేరకు రౌస్ అవెన్యూ కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేయగా.. న్యాయస్థానం ఆమెకు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. దీంతో కవిత గత 5 నెలలకు పైగా తీహార్ జైలులోనే ఉన్నారు. పలుమార్లు బెయిల్ పిటిషన్ దాఖలు చేసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఆమె సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా.. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీం ధర్మాసనం ఇరు పక్షాల వాదనలు విన్నది. కవిత తరపు న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ.. సౌత్ గ్రూప్ 100 కోట్లు అంటున్నారని.. కానీ ఇప్పటి వరకు ఒక్కరూపాయి కూడా రికవరీ చేయలేదని అన్నారు. విచారణలో తీవ్ర ఆలస్యం జరుగుతోందని.. ఇది పూర్తిగా తప్పుడు కేసు అన్నారు. దర్యాప్తు సంస్థలు అడిగిన ఫోన్లను కవిత ఇప్పటికే అప్పగించారన్నారు. కవిత ఫోన్లు మార్చారని అంటున్నారని.. ఫోన్లు మార్చటంలో తప్పేముందని ప్రశ్నించారు. ఈ కేసులో 493 మంది సాక్షులను విచారించారన్నారు. సాక్షులను బెదిరించారని కవితపై అభియోగాలు మోపుతున్నారని.. కానీ ఎక్కడా కేసు నమోదు కాలేదన్నారు. కవిత ఎక్కడికి పారిపోదని.. సిసోడియాకు ఇచ్చిన బెయిల్ అవకాశాలే కవితకు వర్తిస్తాయని చెప్పారు. వీటన్నింటిన పరిగణలోనికి తీసుకొని బెయిల్ మంజూరు చేయాలన్నారు. సీబీఐ, ఈడీ తరపు న్యాయవాది ఎస్వీ రాజు వాదనలు వినిపిస్తూ.. కవిత ఫోన్లలో ఉన్న డేటాను ఉద్దేశ్యపూర్వకంగా ఫార్మాట్ చేశారన్నారు. ఫోన్‌లో డేటా ఎక్కువైనప్పుడు డెలీట్ చేస్తారు కానీ.. ఫార్మాట్ చేయరన్నారు. కవిత ఆధారాలు, సాక్ష్యాలు తారుమారు చేశారని వాదించారు. దర్యాప్తునకు కవిత సహకరించటం లేదని.. ఈ పరిస్థితుల్లో ఆమెకు బెయిల్ ఎలా ఇస్తామని సీబీఐ, ఈడీ తరపు న్యాయవాది ఎస్వీ రాజు తన వాదనలు వినిపించారు.



# భయం పరిచయం చేసిన దేవర

టాలీవుడ్ మాస్ హీరో మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ హీరోగా దర్శకుడు కొరటాల శివ తెరకెక్కించిన భారీ పాన్ ఇండియా యాక్షన్ చిత్రం "దేవర" కోసం అందరికీ తెలిసిందే. ఎన్టీఆర్ కొరటాల నుంచి రాబోతున్న రెండో సినిమా ఇది కావడం పైగా పాన్ ఇండియా సినిమా కావడంతో అంచనాలు పీక్స్ లో ఉన్నాయి. మరి మొదటి నుంచి కూడా భయాన్నే భయపెట్టే వాడే మా దేవర అన్నట్టుగా చూపిస్తూ వస్తున్నా మేకర్స్ ఇప్పుడు ఒక పవర్ ఫుల్ పోస్టర్ ని రిలీజ్ చేశారు. తమ భయం తాలూకా ముఖాలు వీరే అంటూ ఎన్టీఆర్ తాలూకా రెండు డిఫరెంట్ లుక్స్ ని కలిపి ఉన్న పోస్టర్ ని రిలీజ్ చేశారు. ఇందులో ఒక ముఖం నవ్వుతూ ఒక ముఖం కోపంగా కనిపిస్తున్నాయి. అలాగే దీనితో దేవర రిలీజ్ కి మరొక్క నెల మాత్రమే ఉందని అలర్ట్ చేస్తున్నారు. ఇక నెలలో ఎలాంటి అప్డేట్స్ రానున్నాయి అనేది చూడాలి. ఇక ఈ భారీ చిత్రానికి అనిరుద్ సంగీతం అందిస్తుండగా ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ వారు నిర్మాణం వహిస్తున్నారు.






# శ్రద్ధా హాట్ లుక్

ప్రియాంక చోప్రాను అధిగమించిన శ్రద్ధాకపూర్

ప్రస్తుతం హిందీ చిత్రసీమలో కథానాయిక శ్రద్ధాకపూర్ పేరు మార్మోగిపోతున్నది. ఇటీవల విడుదలైన 'స్త్రీ-2' చిత్రంతో కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌ను తన ఖాతాలో వేసుకుందీ భామ. దాదాపు 400కోట్లకుపైగా వసూళ్లతో ఈ సినిమా బాక్సాఫీస్ రేసులో దూసుకుపోతున్నది. ఇందులో శ్రద్ధాకపూర్ నటనకు సర్వత్రా ప్రశంసలు దక్కుతున్నాయి. ఈ విజయంతో ఓ అరుదైన ఘనతను సొంతం చేసుకుంది శ్రద్ధాకపూర్. ఇప్పటివరకు ఆమె నటించిన సినిమాల మొత్తం వసూళ్లు 1603 కోట్లను దాటాయి. దీంతో ఈ భామ అగ్ర కథానాయిక ప్రియాంక చోప్రాను అధిగమించింది. బాలీవుడ్ హీరోయిన్స్ లైఫ్‌టైమ్ కలెక్షన్స్ జాబితాలో 3195 కోట్లతో దీపికా పడుకోన్ అగ్రస్థానంలో ఉండగా కత్రినాకైఫ్, కరీనాకపూర్, అలియాభట్ ఆ తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు. 'స్త్రీ-2' వసూళ్లతో శ్రద్ధాకపూర్ ఈ జాబితాలో ఐదో స్థానానికి చేరుకుంది.

# తెలంగాణలో డెంగ్యూ విజృంభణ




తెలంగాణలో డెంగ్యూ విజృంభిస్తోంది. కొన్నిరోజులుగా ఈ కేసులు భారీగా పెరుగుతున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం ఈ ఏడాదిలో ఇప్పటివరకు 5,372 మంది దీని బారిన పడ్డారు. జూన్ నెలాఖరు వరకు 1,078 మందికి నిర్ధారణవగా, గత రెండు నెలలుగా 4,294 నమోదయ్యాయి. డెంగ్యూ నిర్ధారణకు జరుపుతున్న పరీక్షల్లో 6.5 శాతం పాజిటివిటీ ఉంటోంది. ప్రతి 200 నమూనాల్లో 13 మందికి డెంగ్యూ నిర్ధారణ అవుతోంది. అత్యధికంగా హైదరాబాద్‌లో నమోదు కాగా తర్వాతి స్థానాల్లో సూర్యాపేట, మేడ్చల్, ఖమ్మం, నల్గొండ, నిజామాబాద్, రంగారెడ్డి, జగిత్యాల, సంగారెడ్డి, వరంగల్ జిల్లాలు ఉన్నాయి. సెప్టెంబరు నెలాఖరు వరకు డెంగ్యూకేసులు పెరిగే అవకాశం ఉందని వైద్యఆరోగ్యశాఖ అంచనా వేస్తోంది. గత ఏడాది 8,016 డెంగీ కేసులు నమోదు కాగా ఒకరు మృతి చెందినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఈ ఏడాది భారీగా కేసులు నమోదైనా డెంగ్యూ మరణాలు లేవని వైద్యఆరోగ్యశాఖ తెలిపింది. రాష్ట్రంలో చికున్ గున్యా కేసులూ పెరుగుతున్నాయి. చికున్ గున్యా ఉందన్న అనుమానంతో 2,673 నమూనాలను పరీక్షించగా 152 కేసులు వెలుగు చూశాయి. దీనికి సంబంధించి 5శాతం పాజిటివిటీ ఉంటోంది. ఈ కేసులు అత్యధికంగా హైదరాబాద్, వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో బయటపడుతున్నాయి. గత ఏడాది అధికారికంగా 43 గున్యా కేసులు నమోదయ్యాయి. డెంగ్యూ బాధిత చిన్నారులతో నిలోఫర్, గాంధీ, ఉస్మానియా, ఫీవర్ ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. నిలోఫర్‌లో 12 యూనిట్లు ఉండగా.. ప్రతి యూనిట్‌లో 10 నుంచి 12 మంది చికిత్స పొందుతున్నారు. తీవ్ర అస్వస్థతకు గురైన 15 మంది చిన్నారులను ఐసీయూలో ఉంచారు. ఒకే పడకపై ఇద్దరు, ముగ్గురికి చికిత్స అందిస్తున్నారు. గాంధీ, ఉస్మానియా, ఫీవర్ ఆసుపత్రుల్లోనూ అదే స్థాయిలో రోగులు జ్వరాలతో వస్తున్నారు. బాధితుల్లో ఏడాదిన్నర నుంచి 12 ఏళ్ల వయసు పిల్లలు ఉంటున్నారు. పిల్లలకు ఈ కాలంలో జ్వరం వస్తే తొలుత డెంగ్యూగానే అనుమానించి పరీక్షలు చేయించాలని వైద్యులు సూచిస్తున్నారు. లేదంటే నాలుగైదు రోజుల్లోనే పరిస్థితి విషమించే ప్రమాదముందన్నారు. డెంగ్యూకి కారణమయ్యే టైగర్ దోమ మంచి నీటిలో పెరిగి.. ఎక్కువగా పగటిపూట మాత్రమే కుడుతుంది. ఈ క్రమంలో బడులకు, ఆడుకోవడానికి బయటకు వెళ్తున్న చిన్నారులు దోమకాటు బారిన పడుతున్నారు. దోమల నివారణకు పాఠశాలల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

### డెంగ్యూ.. మీలో ఈ లక్షణాలు ఉన్నాయా?

ఏపీ, తెలంగాణలో డెంగ్యూ కేసులు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో మీలో ఈ లక్షణాలు ఉంటే వెంటనే టెస్ట్ చేయించుకోండి. తీవ్రమైన తలనొప్పి, 102 డిగ్రీలకు పైగా జ్వరం, చలి జ్వరం, కీళ్ల నొప్పులు, కంటి నొప్పి, నీరసంతో పాటు చర్మంపై దద్దుర్లు, ఎముకలు లేదా కండరాల నొప్పి, వికారం, వాంతులు, ఊపిరి తీసుకోవడంతో ఇబ్బంది ఎదురవుతాయి. డెంగ్యూకు ప్రత్యేకమైన మెడిసిన్ అంటూ ఏమీ లేదు. లక్షణాలను పరిగణనలోకి తీసుకొని చికిత్స అందిస్తారు.

# భారత్‌లో టెలిగ్రామ్‌పై నిషేధం?

ప్రముఖ మెసేజింగ్ యాప్‌లలో ఒకటైన టెలిగ్రామ్ భారత్‌లో నిషేధానికి గురయ్యే అవకాశాలు ఉన్నాయి. మోసాలు, జూదం వంటి అక్రమ కార్యకలాపాలకు ఈ యాప్‌ను వినియోగిస్తున్నారని పెద్ద ఎత్తున ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆరోపణలపై ప్రస్తుతం హోంశాఖ, ఐటీ శాఖ సహకారంతో ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్(ఐ4సీ) విచారణ జరుపుతున్నది.టెలిగ్రామ్‌లో అక్రమ కార్యకలాపాలతో పాటు ఇది భారతదేశ ఐటీ నిబంధనలను పాటిస్తున్నదా అనేది విచారణలో తేలనుంది. ఒకవేళ నిబంధనలకు విరుద్ధంగా టెలిగ్రామ్ పని చేస్తుందని విచారణలో వెల్లడైతే ఈ యాప్‌ను నిషేధించే అవకాశం ఉంది. కాగా, మానవ అక్రమ రవాణా, మోసాలు, సైబర్ బెదిరింపులు వంటి వాటిలో ప్రమేయం ఉందనే ఆరోపణలతో మూడు రోజుల క్రితం టెలిగ్రామ్ వ్యవస్థాపకుడు, సీఈఓ పవెల్ దురోవ్‌ను ఫ్రెంచ్ అధికారులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.





# యాదాద్రిలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గర్భాలయం వద్దకు చేరుకున్న గవర్నర్.. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆ తర్వాత పండితులు వేదాశీర్వచనం పలికారు. గవర్నర్‌ను శేషవస్త్రంతో సత్కరించి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం దాతల నుంచి విరాళాల సేకరణకు కొత్తగా ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగాన్ని గవర్నర్ ప్రారంభించారు. రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత జిష్ణుదేవ్ వర్మ యాదాద్రికి వెళ్లడం ఇదే తొలిసారి.



# జన్మాష్టమికి రూ.25వేల కోట్ల వ్యాపారం

జన్మాష్టమి సందర్భంగా దేశవ్యాప్తంగా రూ.25,000 కోట్ల వ్యాపారం జరిగినట్లు వ్యాపారుల సమాఖ్య కాయిట్ (కాన్ఫడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్) వెల్లడించింది. పూలు, పండ్లు, మిఠాయిలు, పూజా సామగ్రి, అలంకరణ వస్తువులు, పాలు, పెరుగు, వెన్న, డ్రై ఫ్రూట్స్ పెద్ద ఎత్తున అమ్ముడైనట్లు కాయిట్ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ ప్రవీణ్ ఖండేల్వాల్ వెల్లడించారు. డిజిటల్ శకటాలు, సెల్ఫీ పాయింట్లు ఈసారి ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచినట్లు ఖండేల్వాల్ తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రధాన నగరాలు సహా పల్లెల్లో ఆగస్టు 26న పెద్ద ఎత్తున జన్మాష్టమి వేడుకలు నిర్వహించుకున్న విషయం తెలిసిందే. మరోవైపు రాఖీ పండగ సందర్భంగా దాదాపు రూ.12,000 కోట్ల వ్యాపారం జరిగి ఉంటుందని కాయిట్ అంచనా వేసింది.


సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# వుమెన్స్ టీ20 వరల్డ్ కప్ షెడ్యూల్‌ని ప్రకటించిన ఐసీసీ



ఐసీసీ వుమెన్స్ టీ20 వరల్డ్‌కప్ 2024కి కౌంట్‌డౌన్ మొదలైంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వేదికగా అక్టోబర్ 3న మెగా టోర్నీ ప్రారంభం కానున్నది. వాస్తవానికి టీ20 వరల్డ్ కప్ బంగ్లాదేశ్‌లో నిర్వహించాల్సి ఉండగా.. ఆ దేశంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో యూఏఈకి తరలిస్తూ నిర్ణయం తీసుకున్నది. మ్యాచులన్నీ దుబాయి, షార్జాలో జరుగనున్నాయి. వరల్డ్ కప్‌లో మొత్తం 10 జట్లు పాల్గొననున్నాయి. ఐదేసి జట్ల చెప్పన రెండు గ్రూపులుగా విభజించారు. గ్రూప్-ఏలో భారత్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, పాకిస్థాన్, శ్రీలంక జట్లు ఉన్నాయి. ఇక గ్రూప్-బీలో దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, వెస్టిండిస్, బంగ్లాదేశ్ స్కాట్‌లాండ్ ఉన్నాయి. సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ ఒకటి వరకు పది ప్రాక్టీస్ మ్యాచులు జరుగనున్నాయి. టోర్నమెంట్‌లో ప్రతి జట్టు నాలుగు గ్రూప్ మ్యాచ్‌లు ఆడుతుంది. ఇందులో ప్రతి గ్రూప్ నుంచి తొలి రెండుస్థానాల్లో నిలిచిన జట్లు సెమీస్‌కు చేరనున్నాయి. సెమీస్ మ్యాచులు 17, 18 తేదీల్లో జరుగుతున్నాయి. అదే నెల 20న దుబాయి వేదికగా ఫైనల్ జరుగనున్నది. సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచులకు రిజర్వ్ డే ఉంటుంది. దుబాయి, షార్జాల్లో మొత్తం 23 మ్యాచ్‌లు జరగనున్నాయి. భారత్, పాకిస్థాన్‌లు ఒకే గ్రూప్‌లో ఉండగా.. అక్టోబర్ 6న దుబాయిలో భారత్ తన చిరకాల ప్రత్యర్థి పాక్‌తో తలపడనున్నది. ఈ మ్యాచ్ మధ్యాహ్నం 2 గంటలకు మొదలవనున్నది. బీసీసీఐ ఇప్పటి వరకు టీ20 వరల్డ్ కప్‌కు జట్టును ప్రకటించాల్సి ఉంది.






# రూ.35కే టీబీ పరీక్ష..

## రెండున్నర గంటల్లో ఫలితం

క్షయ వ్యాధి పరీక్షకు అస్సాంలోని దిబ్రుగఢ్‌లో ఉన్న ఐసీఎంఆర్-ప్రాంతీయ వైద్య పరిశోధన కేంద్రం(ఆర్ఎంఆర్‌సీ) కొత్త విధానాన్ని అభివృద్ధి చేసింది. దీని ద్వారా కేవలం రూ.35 ఖర్చుతో టీబీ పరీక్ష చేయొచ్చు. సీఆర్ఐఎస్‌పీఆర్ ఆధారిత టీబీ పరీక్షను రోగుల కఫంతో చేస్తారు. సులువుగా, మూడు దశల్లో ఈ పరీక్ష ఉంటుంది. రెండున్నర గంటల్లో దాదాపు 1,500 నమూనాల పరీక్షలను ఏకకాలంలో చేయవచ్చని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్(ఐసీఎంఆర్) వర్గాలు తెలిపాయి. ఇప్పటివరకు ఎక్కువగా మైక్రోస్కోపీ, న్యూక్రియిక్ యాసిడ్ ఆధారిత పరీక్ష పద్ధతులు పాటిస్తున్నారు. వీటి ద్వారా టీబీ లేదని నిర్ధారణ అయ్యేందుకు 42 రోజుల సమయం పడుతుంది.



## చంపేస్తామంటూ కంగనా రనౌత్‌కు బెదిరింపు..

# డీజీపీకి వీడియో షేర్ చేసిన ఎంపీ

బీజేపీ ఎంపీ, నటి కంగనా రనౌత్‌కు బెదిరింపులు వచ్చాయి. చంపేస్తామంటూ కొందరు ఓ వీడియో ద్వారా బెదిరించారు. ఈ నేపథ్యంలో ఆ వీడియోను మహారాష్ట్ర డీజీపీకి పోస్టు చేస్తూ తనకు రక్షణ కల్పించాలని ఆమె కోరారు. కంగనా నటించిన ఎమర్జెన్సీ చిత్రం త్వరలో రిలీజ్ కానున్నది. ఆ ఫిల్మ్‌కు చెందిన టీజర్ ఇటీవల రిలీజైంది. ఆ సినిమాలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పాత్రను కంగనా రనౌత్ పోషిస్తున్నారు. కంగనాను వీడియో ద్వారా బెదిరించిన వ్యక్తులు ఓ రూమ్‌లో కూర్చుని ఉన్నారు. ఇద్దరు మాత్రం నిహంగ్ సిక్కుల తరహాలో డ్రెస్సు ధరించారు. ఒకవేళ ఆ సినిమా రిలీజైతే, అప్పుడు దాన్ని ఖండిస్తామన్నారు. మీ సినిమాను చెప్పలతో కొడుతామని ఆ వీడియోలో ఓ వ్యక్తి హెచ్చరికలు చేశాడు.ఒకవేళ ఎమర్జెన్సీ సినిమాలో ఖలిస్తానీ నేత జర్నైయిల్ సింగ్ భింద్రన్వాలేను ఉగ్రవాదిగా చిత్రీకరిస్తే ఊరుకోబోమని, ఇందిరా గాంధీకి ఏం జరిగిందో గుర్తు ఉంచుకోవాలని అన్నారు. భింద్రన్‌వాలేను కొనియాడుతూ విక్కీథామస్ సింగ్ అనే వ్యక్తి వార్నింగ్ ఇచ్చారు. ఇందిరను హత్య చేసిన బాడీగార్డులు సత్వంత్ సింగ్, బియాంత్ సింగ్ గురించి కూడా ఆ వ్యక్తి వీడియోలో ప్రస్తావించాడు. వీడియోకు చెందిన పోస్టును షేర్ చేస్తూ.. మహారాష్ట్ర, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్ పోలీసులకు నటి కంగనా ఫిర్యాదు చేశారు.



# రేపు పీసీసీ చీఫ్ ప్రకటన?

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కొత్త అధ్యక్షుడి ఎంపికపై నెలకొన్ని ఉత్కంఠ మరికొద్దిసేపట్లో తెర పడనుంది. ఈ మేరకు పీసీసీ సారథి ఎంపిక ఎట్టకేలకు ఖారారైనట్లు సమాచారం. అయితే గత కొంతకాలంగా పీససీ అధ్యక్ష పదవి కోసం పలువురు నేతలు పోటీ పడ్డారు. తమ పేర్లను పరిశీలించాలని అధిష్టాన వర్గానికి సైతం కోరారు. అయితే పీసీసీ అధ్యక్షుడి పేరు దాదాపు ఖరారు అయినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల ఢిల్లీలో పార్టీ అధిష్టానంతో పలు దఫాలు సమావేశమైన రాష్ట్ర నాయకులు పీసీసీ అధ్యక్షుడి ఎంపిక, మంత్రివర్గ విస్తరణకు సంబంధించి తీవ్రంగా చర్చించినట్లు సమాచారం. ఇందులో భాగంగానే బీసీ సామాజిక వర్గానికి చెందిన ప్రచార కమిటీ సభ్యుడు మధుయాష్కీగౌడ్, ప్రస్తుత కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎస్టీ సామాజిక వర్గం నుంచి ఎంపీ బలరాం నాయక్ వంటి పేర్లు పరిశీలనకు వచ్చాయని సమాచారం. ఈ చర్చల్లో బీసీలకే పీసీసీ అధ్యక్ష పదవి ఇచ్చేందుకు అధిష్టానం మొగ్గు చూపినట్లు తెలిసింది. దీంతో బీసీ నాయకుడే పీసీసీ సారథిగా ఎంపికయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని కనిపిస్తున్నాయి. అయితే రాష్ట్ర నాయకత్వం నుంచి అభిప్రాయం తీసుకున్న పార్టీ అధిష్టానం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అధ్యక్షుడితోపాటు కార్యనిర్వాహక అధ్యక్షుల సహా మరికొన్ని పదవులు కూడా ప్రకటించే అవకాశం ఉంది. అయితే, పీసీసీ అధ్యక్ష రేసులో ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు నేతలు పోటీ పడుతున్నారు. మధుయాష్కీతోపాటు మహేశ్ కుమార్ తో వేర్వేరుగా అభిప్రాయాలు తీసుకున్నట్లు సమాచారం. చివరకు మహేశ్ కుమార్ గౌడ్ వైపై అధిష్టానం మొగ్గు చూపినట్లు గాంధీ భవన్ వర్గాల్లో చర్చ నడుస్తోంది. కాగా, నేడో రేపో అధిష్టాన వర్గం అధికారికంగా పేరును ప్రకటించే అవకాశం ఉంది.

# హైడ్రా కూల్చివేతలపై బీజేపీలో అయోమయం

హైడ్రా కూల్చివేతలపై బీజేపీ నాయకులు తలో మాట మాట్లాడుతున్నారు. 'కూల్చివేతలతో సామాన్యులను CM రేవంత్ భయపెడుతున్నారు. నీ అయ్య జాగీరా కూల్చడానికి' అని ఈటల వ్యాఖ్యానించారు. 'కూల్చివేతలకు ఎవరైనా అడ్డొస్తే బుల్డోజర్లు ఎక్కించండి' అంటూ రఘునందన్ రావు అన్నారు. 'పాతబస్తీలో అక్రమ నిర్మాణాలను కూల్చే దమ్ము రేవంత్‌కు ఉందా' అంటూ మహేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. దీంతో ఆ పార్టీ నేతలు, కార్యకర్తల్లో అయోమయం నెలకొంది.



# త్వరలో సింగపూర్‌కు మోదీ?

ప్రధాని నరేంద్రమోదీ త్వరలో సింగపూర్‌లో పర్యటిస్తారని ఆదేశ విదేశాంగ మంత్రి వివియన్ బాలకృష్ణన్ అన్నారు. రెండు దేశాల మంత్రుల రౌండ్‌టేబుల్ సమావేశాలు ఫలవంతంగా సాగాయన్నారు. డిజిటల్, నైపుణ్యాభివృద్ధి, వైద్యం, కనెక్టివిటీ, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్ అంశాల్లో ద్వైపాక్షిక సహకారం మెరుగుదలకు అవకాశాలను అన్వేషించామన్నారు. సెమీ కండక్టర్ల తయారీ, వైమానిక రంగంలో సహకారంపై చర్చించామని పేర్కొన్నారు.






## లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్..

# కొనసాగుతున్న ఆదిలాబాద్ బంద్

లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ తుడుం దెబ్బ, ఏజెన్సీ సంఘాలు ఆదిలాబాద్ జిల్లా బంద్‌కు పిలుపునిచ్చాయి. దీంతో తుడుం దెబ్బ, ఏజెన్సీ నాయకులు ఆదిలాబాద్ ఆర్టీసీ బస్ డిపో ఎదుట బైఠాయించారు. బస్సులు బయటకు రాకుండా అడ్డుకున్నారు. దీంతో బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. ఇక బంద్ నేపథ్యంలో దుకాణాలు తెరచుకోలేదు. జీవో 3ను యథావిధిగా కొనసాగించాలని ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర కో కన్వీనర్ గోడం గణేశ్ డిమాండ్ చేశారు.రు. వలస లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు భాగంగా ఏజెన్సీ బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాగా, ఎస్టీ జాబితా నుంచి లంబాడీ సామాజికవర్గాన్ని తొలగించి అడవి తల్లిపై ఆధారపడి జీవిస్తున్న తమకు న్యాయం చేయాలని ఆదివాసులకు ఏండ్లుగా డిమాండ్ చేస్తున్నారు. ఇతర రాష్ట్రాలలో బీసీ, ఎస్సీగా ఉన్న ఆ సామాజికవర్గం, తెలంగాణలో ఎస్టీ జాబితాలో కొనసాగుతుండటం వల్ల ఆదివాసీలు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఎస్టీ వర్గీకరణతోనే రాష్ట్రంలో ఆదివాసీలకు న్యాయం జరుగుతుందని ఆదివాసీ సంఘాలు పేర్కొంటున్నాయి. సుప్రీం తీర్పును అనుసరించి ఎస్టీ జాబితాలోని తెగలను జనాభా ప్రకారం లెక్కించి వర్గీకరించాలని కోరుతున్నాయి.




# ట్రంప్‌కు మద్దతుగా తులసి గబ్బార్డ్

డెమోక్రట్ మాజీ నేత తులసి గబ్బార్డ్ రిపబ్లికన్ అభ్యర్థి ట్రంప్‌నకు మద్దతుగా ప్రచారం చేయనున్నారు. మిచిగాన్‌లో నేషనల్ గార్డ్ అసోసియేషన్ సమావేశంలో ఆమె మాట్లాడారు. అమెరికా ప్రభుత్వం ప్రపంచవ్యాప్తంగా బహుళ యుద్ధాలను ఎదుర్కొంటుందని, ఎన్నడూ లేని విధంగా అణు యుద్ధం అంచున ఉందని పేర్కొన్నారు. దీని నుంచి ట్రంప్ బయటపడేస్తారని చెప్పారు. కాగా ట్రంప్‌కు ప్రసంగాలు, డిబేట్లలో తులసి సలహాదారుగా వ్యవహరిస్తారు.

# పిల్ల చాలా హాట్

హుషారు సినిమాతో వెండితెరకి పరచయమైంది రమ్య పసుపులేటి. తొలి సినిమాతోనే మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ బ్యూటీ ఆ తర్వాత మైల్స్ ఆఫ్ లవ్, ఫస్ట్ ర్యాంక్ రాజు వంటి సినిమాల్లో యాక్ట్ చేసింది. ఇక పలు వెబ్ సిరీస్‌లలో కూడా రమ్య నటించింది.మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర' సినిమాలో లక్కీ ఛాన్స్ కొట్టేసింది రమ్య పసుపులేటి. ఇటీవల చిరంజీవితో కలిసి సెట్స్‌లో తీసుకున్న ఫొటోను షేర్ చేస్తూ ఈ విషయాన్ని రమ్య ప్రకటించింది. ఇక హుషారు సినిమాతో వెండితెరకి పరిచయమైన రమ్యకి సోషల్ మీడియాలో మంచి ఫాలోయింగ్ ఉంది. ఇక ఈ బ్యూటీ షేర్ చేసే ఫొటోలు, వీడియోలు మాములుగా ఉండవు. ఫొటో ఏదైనా హాట్ ట్రీట్ పక్కా అనేలా అందాలతో ఇచ్చిపడేస్తుంది రమ్య. ఈ బ్యూటీ ఫొటోలపై మీరూ ఓ లుక్కేయండి.

# బిర్యానీకి డబ్బులు ఇవ్వలేదని అన్నను చంపిన తమ్ముడు

బిర్యానీకి డబ్బులు ఇవ్వలేదనే కోపంతో సొంత అన్నను తమ్ముడు కడతేర్చిన ఘటన గొల్లపూడిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గొల్లపూడి సాయిపురంకాలనీలో గాలి తమ్మయ్య కూలికి వెళ్తూ జీవిస్తున్నాడు. అతనికి రాము(36), సూర్రెడ్డి, లక్ష్మారెడ్డి ముగ్గురు కుమారులున్నారు. సోదరుడైన రాము ఇంటికి లక్ష్మారెడ్డి ఆదివారం రాత్రి వెళ్లాడు. తన భార్య రొయ్యల బిర్యానీ తీసుకు రమ్మన్నదని, అందుకు డబ్బులు ఇవ్వాలని రామును లక్ష్మారెడ్డి కోరాడు. రాము తన వద్ద డబ్బులు లేవనడంతో.. ఎందుకు ఇవ్వవని లక్ష్మారెడ్డి వాగ్వాదానికి దిగాడు. రాము చెంపపై లక్ష్మారెడ్డి కొట్టడంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. లక్ష్మారెడ్డి కిటికీ చెక్కతో రాము తలపై కొట్టడంతో కింద పడిపోయాడు. ఓ పక్క రాము భార్య అడ్డుకున్నా... లక్ష్మారెడ్డి కొడుతూనే ఉండడంతో రాము అక్కడే ప్రాణాలు వదిలాడు. పోలీసులు లక్ష్మారెడ్డిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ ఉమామహేశ్వరరావు తెలిపారు.